

మనుషుల్ని దూరం చేసే మనస్తత్వాల గురించిన కథ

# ఓటమి

ఆదుర్తి బాల

"ఏమేవ్- అన్నయ్య ఫోన్జేశాడు రేపు వస్తున్నాడట" అన్నాడు శంకరం.

"అలాగా ఏం పని మీదో చెప్పారా" అన్నది రంజని ఏదో ఆలోచిస్తూ.

"అదేం చెప్పలేదులే చూసి చాలా రోజులైందిగా అందుకని వస్తూండచ్చులే" తేలిగ్గా అన్నాడు శంకరం.

"ఇంతకాలం రానివాడు ఇప్పుడెందుకొస్తున్నాడనే నా సందేహం" అన్నది రంజని.


"అదేం మాటే! పాపం వాడు రాకరాక వస్తుంటే" విసుగ్గా అన్నాడు శంకరం.

"అన్నయ్య వ్యాపారంలో దెబ్బతిన్నాడనీ ఉన్నదంతా షేర్లలో పెట్టి లక్షల్లో నష్టపోయాడనీ ఒకసారి అన్నారు కదూ మీరు" తన అనుమానానికి బీజం వెతుక్కుంటున్నట్టుగా అన్నది రంజని.

నిట్టూర్చాడు శంకరం. సెన్సెక్స్ ఇరవై వేలకి దూసుకుపోయినప్పుడు అన్నయ్యకి ఓ పాతికవేలిచ్చి తనక్కూడా మంచి షేర్లు కొనమని చెప్పాడు తను. ఇపుడా డబ్బుకి నీళ్లొదులుకోవాల్సిందే. రంజనికి కూడా చెప్పలేదా సంగతి. ఇంకా నయం చెప్పకపోవడమే మంచిదైంది. లేకపోతే చేసేవన్నీ బుర్ర తక్కువ పనులే అని సాధిస్తుంది తనని అనుకున్నాడు శంకరం.

"ఏమిటీ అడిగిందానికి చెప్పకుండా ఏదో ఆలోచిస్తున్నారు" అన్న రంజని మాటలకి తన ఆలోచనకి బ్రేకు పడి ఈ లోకంలోకి వచ్చాడు శంకరం.

"అవునే అన్నయ్య బాగా నష్టపోయాడు. అయినా ఇపుడా గొడవెందుకటా" అసలే తన పాతిక వేలూ పోయినట్టే అని తనేడుస్తుంటే భార్య అడిగే యక్ష ప్రశ్నలు చికాకు తెప్పించాయి శంకరానికి.



"అసలే నష్టాల్లో ఉన్నవాడు ఇపుడు వందలు వందలు టిక్కెట్లకి తగలేసి ఇంత దూరం ఎందుకొస్తున్నట్టో" పాయింటు లాగింది రంజని.

"అవునేవ్...పాయింట్ బాగానే లాగావ్..నా బుర్రకింత ఆలోచన తట్టలేదు సుమా" అన్నాడు శంకరం భార్య తెలివికి అబ్బురపడుతూ.

"మీ బుర్ర సరిగ్గా ఎపుడు పనిచేసింది కనుక" అన్నది రంజని.

"నీలాటి ఆడది పెళ్లయిన కొత్తల్లో మా ఆయనొక్కడే ప్రపంచంలో తెలివైన వాడనుకుంటుందట. కొంత కాలం పోయాక నా మొగుడంత తెలివి తక్కువవాడు ప్రపంచంలోనే లేడనుకుంటుందట" అన్నాడు శంకరం. భార్య తనని తేలిగ్గా చేసి మాట్లాడడం అతడికి నచ్చలేదు.

"నిజం ఎపుడూ నిష్ఠూరంగానే ఉంటుంది గానీ మీ అన్నయ్య కూతురికి పెళ్లి సంబంధమేదో నిశ్చయమైందని చెప్పారు కదూ ఆమధ్య" మాట మారుస్తూ సంభాషణని సరైన మార్గంలోకి నడిపిస్తూ అన్నది రంజని.

"నిజమేగానీ వాడిపుడు లక్షలు కట్నమిచ్చి పెళ్లి చేసే స్థితిలో లేడు కదా" అన్నాడు శంకరం.

"హు! అదన్నమాట సంగతి! ఇపుడు మనం మంచి పొజిషన్‌లో ఉన్నాం కదా! వాళ్లమ్మాయి పెళ్లికి డబ్బు సర్దమని అడగడానికి వస్తుండచ్చు. ఇలాంటి విషయాలు ఫోన్లో మాట్లాడితే బాగుండవు కదా!" అన్నది రంజని.

"నిజంగా అందుకే వస్తున్నాడంటావా" సందేహంగా అన్నాడు శంకరం.

"అందులో సందేహమేమీ లేదు. ఆయన కచ్చితంగా డబ్బు కోసమే వస్తుండచ్చు. అన్నయ్య వస్తున్నాడని ఓ విరగబడిపోతున్నారు. ఆయనొచ్చేది మీమీద ప్రేమ పొంగిపోయి మీరెలా ఉన్నారా అని చూసిపోడానికి కాదు అర్థమైందా"

అన్నయ్య రాకలోని అంతరార్థం అర్థమైనట్టుగా తలూపాడు శంకరం.

"ఏమిటో ఈ బంధువులు కొస్తంత డబ్బు కూడబెట్టుకుంటున్నామని తెలిస్తే బెల్లం చుట్టూ ఈగల్లా ముసురుతారు" గొణుక్కుంది రంజని.

☆ ☆ ☆

మర్నాడు అన్నయ్యని రిసీవ్ చేసుకోడానికి స్టేషన్‌కి వెళ్లాడు శంకరం. బాగా చిక్కిపోయి లోతుకుపోయిన కళ్లతో, కళావిహీనంగా ఉన్న మొఖంతో చిన్న చేతి సంచీ పట్టుకొని దిగాడు సత్యనారాయణ.

ప్రస్తుతం అతనున్న ఆర్థిక స్థితికి దర్పణంలా ఉన్న

అన్నయ్యని చూడగానే శంకరానికి భార్య ఊహించింది నిజమే అనిపించింది.

"ఏరా బాగున్నావా" ఆప్యాయంగా తమ్ముడి భుజం మీద చెయ్యి వేస్తూ అన్నాడు సత్యనారాయణ.

"ఆ.. ఆ.. బాగానే ఉన్నాను" పొడిపొడిగా సమాధానమిచ్చాడు శంకరం. 'కాస్తంత అంటీ ముట్టనట్టు ప్రవర్తించండి' అన్న భార్య మాటలని అమలులో పెట్టాడు శంకరం.

దారి పొడుగునా సత్యనారాయణ ఏవో కబుర్లు చెబుతూనే ఉన్నాడు. మధ్యలో అన్నయ్య అడిగిన ప్రశ్నలకి ముక్తసరిగా సమాధానం చెప్తున్నాడు శంకరం. తమ్ముడి వైఖరిలో మార్పు కాస్తంత వింతగానే అనిపించింది సత్యనారాయణకి.

ఇంటికి వచ్చాక కుశలప్రశ్నలవీ అయ్యాక "స్నానం చేసి రండి బావగారూ భోజనం వడ్డిస్తాను" అన్నది రంజని.

"అక్క ఆరోగ్యం బాగుందా బావగారు - శాంతి ఏం చేస్తోంది?" ఏదో ఒకటి మాట్లాడాలన్నట్టుగా అన్నది రంజని భోజనాలు చేస్తున్నప్పుడు.

"దాని ఆరోగ్యం అంత బాగుండలేదమ్మా. సంతోషం సగం బలం అన్నారు. ఆ సంతోషం లేనపుడే అన్ని అనారోగ్యాలూనూ. మీకు తెలిసే ఉంటుంది నాకీ మధ్య బిజినెస్‌లో నష్టాలొచ్చాయని. నేనే కాదమ్మా నాలాటి ఇన్వెస్టర్లెంతమందో షేర్స్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోయారు. నేనింకా నయం నాకున్న డబ్బు అంతా పెట్టుబడి పెట్టి నష్టపోయాను. కొంతమంది అప్పులు తీసుకొని మరీ వేల సంఖ్యలో షేర్స్ కొన్నారు. వాళ్ల పరిస్థితి మరీ ఘోరం. వ్యాపారంలో నష్టమొచ్చిందని ఒక బెంగ. చేసిన అప్పులు ఎలా తీర్చాలనేది ఇంకో బెంగ! శాంతికి రెండు లక్షలు కట్నమిచ్చి పెళ్లిచేద్దామనుకున్నాను. నిశ్చితార్థం జరుపుదామనుకున్నాం. ఇంతలోనే ఇలా నష్టపోతానని అనుకోలేదు. ఇపుడు దాని పెళ్లి ఎలా చేయాలన్నదే సమస్య" దిగులుగా నవ్వాడు సత్యనారాయణ.

గుండె గుభిల్లుమంది రంజనికి. ఈ ఉపోద్ఘాతంలోని ఆంతర్యం గురించి ఆలోచిస్తున్నాడు శంకరం.

"వంట బాగుందమ్మా...అయినా ఎందుకమ్మా పాయసం, పులిహోరా కూడా చేశావు. ఏదో మామూలుగా వంట చేస్తే సరిపోయేదిగా ఇంత శ్రమెందుకు? నేనేమన్నా పరాయివాడినా" ఆప్యాయంగా మందలిస్తున్నట్టుగా అన్నాడు సత్యనారాయణ.

"అయ్యో రాకరాక వచ్చారు. ఆమాత్రం శ్రమ పడడంలో తప్పేం లేదు లెండి" అన్నది రంజని.

"ఊరికే రాలేదు లేమ్మా పనిమీదే వచ్చాను" అన్న సత్యనారాయణ మాటలకి రంజనీ, శంకరం ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు.

"ఇంతకీ ఎలా ఉందిరా నీ ఉద్యోగం? ప్రమోషన్లేమైనా వచ్చాయా" అన్నాడు సత్యనారాయణ.

"లేదన్నయ్యా" అన్నాడు శంకరం టక్కున.

"అదేవిటీ ఇంత సర్వీసుందిగా మేనేజరై పోయి ఉంటావనుకున్నాను. పోనీలే దిగులు పడకు నువ్వు త్వరలోనే మేనేజర్ స్థాయికొస్తావులే" తమ్ముడిని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నట్టుగా అన్నాడు సత్యనారాయణ.

## నో లవ్!

కుర్రతార కాజల్‌ని మీకెప్పుడైనా లవ్‌లెటర్స్ వచ్చాయా? అని అడిగితే- 'రాకేం? చాలా వచ్చాయి. సినిమాల్లోకి రాకముందు చదువుకునే రోజుల్లో కొంటె కుర్రాళ్లు చాలామంది నాకు రాసిన లవ్ లెటర్స్ చూసి భయపడిపోయేదాన్ని. ఇప్పుడు సినిమాల్లోకి వచ్చాక కూడా అలాంటి ఉత్తరాలు వస్తుంటాయి. కానీ వాటిని నేను పట్టించుకోవడం మానేసాను. కాస్త గ్లామర్‌గా వున్నప్పుడు ఇలాంటివి మామూలేగా. నేను ఇప్పట్లో ఎవర్నీ ప్రేమించను. నేను ప్రేమించేదల్లా నా కెరీర్‌నే' అంటూ ముసిముసిగా నవ్వేస్తుంది.



'అమ్మో అన్నయ్య అసాధ్యుడే తన స్థాయిని బాగానే ఊహించాడు' అనుకున్నాడు శంకరం.

"అసలు వీడికి ఉద్యోగం వేయించడం కోసం ఎంత మంది కాళ్లు పట్టుకున్నానో తెలుసామ్మా రంజనీ. ఇంతా కష్టపడి ఉద్యోగం వేయిస్తే నేను ఆ ఏజెన్సీ ఏరియాలో ఉద్యోగం చేయనంటాడు. మొత్తానికి వాడికి నచ్చచెప్పి ఒప్పించేసరికి తల ప్రాణం తోకకొచ్చిందనుకో! మొదట్లో కాస్త కష్టపడ్డా ఇప్పుడు చూడు ఎంత హేపీగా ఉన్నాడో!" అన్నాడు సత్యనారాయణ. ఆయన వెనుక చేసిన సహాయాలన్నీ గుర్తుచేసి ఇపుడేమీ డబ్బు అడగడు కదా అని మథనపడసాగింది రంజని.

"ఏమిట్రా ఎపుడూ నేను మాట్లాడడమేనా నువ్వసలు నోరే తెరవట్లేదు. ఒంట్లో బాగుంటోందా" అన్నాడు సత్యనారాయణ.

శంకరం చెప్పేలోగానే రంజని అందుకొంది. "ఆయనకీమధ్య అసలు బాగుండట్లేదండీ. ఆఫీసులో పనెక్కువై టెన్షన్స్ పెరుగుతున్నాయి. దాంతో బి.పి. వస్తోంది మధ్య. అప్పుడప్పుడూ గుండె నెప్పి అంటున్నారు. మీకు తెలుసుకదండీ ఈ రోజుల్లో హాస్పిటల్ ఖర్చులెలా ఉంటాయో! ఆ టెస్టులకీ, మందులకీ వేలకి వేలు ఖర్చవుతుంది. అయితే మాత్రం ఖర్చుకి చూసుకుంటామా ఆరోగ్యం ముఖ్యం కదా!"

'ఏమిట్రా నిజమా' అన్నట్టు తమ్ముడి వంక ఆందోళనగా చూశాడు సత్యనారాయణ.

తలొంచుకుని కంచంలో అన్నం కెలుకుతూ కూర్చున్నాడు శంకరం.

"ఏమిటో బావగారూ మాకూ పిల్లలెదిగొస్తున్నారు. వాళ్ల చదువులకయ్యే ఖర్చులూ, పెళ్లిళ్లూ తలుచుకుంటే భయమేస్తోంది. ఇద్దరూ ఆడపిల్లలే కదా వాళ్ల పెళ్లికి అక్కరకొస్తుందని ఇద్దరి పేరా చిట్లు కడుతున్నాం. ఇంటి కోసం లోన్ తీసుకున్నాం. ఇల్లు ఇప్పుడే కట్టించుకోకపోతే పిల్లలు పై చదువులకొచ్చాక మరీ కష్టం కదా!"

అన్నయ్య డబ్బులడక్కుండా ముందరి కాళ్లకు బంధం వేస్తున్నట్టుగా మాట్లాడుతున్న భార్య తెలివికి మనసులోనే ఆనందించాడు శంకరం.

"అన్నిటికీ అతిగా ఆలోచించి బాధపడకండమ్మా. ఆ భగవంతుడి మీద భారం వేసి నిశ్చింతగా ఉండండి. అన్నీ ఆయనే చూసుకుంటాడు" ఓదార్పుగా అన్నాడు సత్యనారాయణ.

భోజనాలయ్యాక అన్నయ్యకి ఒక గదిలో మంచం వేసి పక్కవేశాడు శంకరం. "కాసేపు పడుకో అన్నయ్యా ప్రయాణం చేసి వచ్చావుగా బాగా బడలికగా ఉండి ఉంటుంది. లేచాక మాట్లాడుకుందాంలే" అని తలుపు దగ్గరగా వేసి వెళ్లిపోయాడు

శంకరం. ప్రయాణంలో అలసిపోయిన సత్యనారాయణకి వెంటనే నిద్ర పట్టింది. లేచేసరికి సాయంత్రం ఐదు అయింది. అరె చాలా సేపు పడుకున్నానే అనుకుంటూ లేచి బాల్కనీలోకొచ్చి నిలబడ్డాడు సత్యనారాయణ. ఆ బాల్కనీకి ఆనుకునే శంకరం వాళ్ల గది ఉంది. లోపలి నుండి శంకరం రంజనీ ఏదో మాట్లాడుకుంటున్నారు. తను నిద్రపోతున్నాననుకొని మాట్లాడుకుంటున్నారు వాళ్లు. ఇంకొకళ్ల మాటలు చాటుగా వినడం సభ్యత కాకపోయినా వాళ్ల మాటల్లో తన ప్రసక్తి రావడంతో వాళ్ల సంభాషణ వినాలనే కుతూహలం కలిగింది సత్యనారాయణకి.

"ఇంతకీ మీ అన్నయ్య వచ్చిన పనేమిటో చెప్పనే లేదు" అంటోంది రంజని.

"తన పరిస్థితి గురించి ఉపోద్ఘాతం చెప్పాడుగా - ఇంక డబ్బడుగుతాడు. అయినా నాకు అనారోగ్యమనీ హాస్పిటల్ ఖర్చులనీ, పిల్లల పేర చిట్లు కడుతున్నామనీ ఆయన డబ్బడిగేందుకు అవకాశం లేకుండా ముందరి కాళ్లకి బంధం వేశావుగా నువ్వు" అన్నాడు శంకరం.

"మీరు మాత్రం తక్కువ తిన్నారా ఏమిటీ ప్రమోషన్ వచ్చినా రాలేదని చెప్పలేదూ" అన్నది రంజని.


"అవసరాన్ని బట్టి అబద్ధమాడడం తప్పు కాదులే" తనని తను సమర్థించుకున్నాడు శంకరం.

అంతా విన్న సత్యనారాయణ నిర్ఘాంతపోయాడు. అక్కడ ఒక్క క్షణం కూడా నిలవబుద్ధి కాలేదు. గబగబా బట్టలు మార్చుకున్నాడు. తనని షేర్లు కొనమని తమ్ముడు తన చేతికిచ్చిన పాతిక వేలు గుర్తొచ్చింది. ఆ డబ్బు పెట్టి మంచి షేర్లు కొని కొంత లాభానికి అపుడే అమ్మేశాడు తను. అది తమ్ముడికిచ్చేద్దామనే అనుకున్నాడు కానీ ఏవో పనుల వల్ల కుదరలేదు. ఇపుడా డబ్బు ఇవ్వాలన్నా తన దగ్గర అంత డబ్బు లేదు. అందుకే ఓ నిశ్చయానికొచ్చిన వాడిలా తల పంకించాడు. బంగారం షాపులో తన గొలుసు అమ్మేయాలని అనుకొన్నాడు.

"ఇప్పుడెక్కడికన్నయ్యా బయలుదేరావ్" అన్న తమ్ముడి మాటలకి బదులీయలేదు సత్యనారాయణ. తనకెంతో ఇష్టమైన పులిగోరు లాకెట్టున్న గోల్డుచెయిన్ అమ్మేశాడు.

"శంకరం- ఇదిగోరా నువ్వు షేర్లు కొనమని ఇచ్చిన పాతికవేలూ, దానిమీద వచ్చిన లాభం కలిపి ముప్పై వేలు- పరాయి సొమ్ము పాములాంటిది కదా అందుకే నీ సొమ్ము నీకిచ్చేస్తున్నాను" పరాయి అన్న మాటని నొక్కి పలుకుతూ అన్నాడు సత్యనారాయణ.

"ఇంక వెడతానురా.. అమ్మా రంజనీ వెళ్లొస్తానమ్మా. ఏమ్మా వెళ్లొస్తానని అన్నానని భయపడుతున్నావా- వచ్చినా చుట్టపు చూపుగానే వచ్చి వెళ్లిపోతాను. మిమ్మల్ని డబ్బు సహాయం అడగను. భయపడకు" అన్నాడు శంకరం.



తమ మాటలు బావగారు విన్నారని అర్థమైంది రంజనికి. సిగ్గుతో తలెత్తలేకపోయింది.

అన్నయ్యని ఆపాలని ఉంది శంకరానికి కానీ ఆపే ధైర్యం చేయలేకపోయాడు.

"ఇంత రాత్రివేళ ప్రయాణమేంటన్నయ్యా.. రేపు వెడుదువుగానిలే" అన్నాడు చివరికి గొంతు పెగుల్చుకుని.

విరక్తిగా నవ్వాడు సత్యనారాయణ. "ఒద్దురా ఇక్కడ ఉండీ మీ నోట ఇంకా ఎన్ని అబద్ధాలు వినాల్సొస్తుందో అని భయంగా ఉంది" అంటూ చరచరా బయటకి నడిచి చీకటిలో కలిసిపోయాడు సత్యనారాయణ.

బస్సు సీట్లో జారగిలబడి బయటకు చూస్తూ కూర్చున్నాడు సత్యనారాయణ. చీకటిని పారద్రోలే ప్రయత్నంలో మినుకుమినుకుమంటున్నాయి నక్షత్రాలు. అమావాస్య రోజులు కాబోలు చంద్రుడు రేఖామాత్రంగా కనబడుతున్నాడు. కిటికీలోంచి వీచే చల్లగాలికి బస్సులో ప్రయాణీకులు అందరూ నిద్రపోతున్నారు.

సత్యనారాయణకి నిద్ర రావట్లేదు. చిన్నప్పుడే తండ్రి చనిపోతే తమ్ముడి బాధ్యతను తను తీసుకొని చదివించి, ఉద్యోగం వేయించి పెళ్లి చేశాడు. తండ్రి మిగిల్చిన ఆస్తిపాస్తులేమీ లేవు. తమ్ముడి చదువంతా తన సంపాదనతోనే సాగింది. అయినా ఆనందంగానే భరించాడు తను. కానీ వాడికి ఆమాత్రం కృతజ్ఞత కూడా లేకపోయింది. తన కూతురి పెళ్లికి వాడు తప్పకుండా సహాయం చేస్తాడని ఆశపడ్డాడు తను. అన్నయ్యా అంటూ అమాయకంగా తన చుట్టూ తిరుగుతూ, తన సలహాలని పాటిస్తూ తన పెద్దరికానికి గౌరవమిచ్చే తమ్ముడి మొఖమే గుర్తుంది తనకి. పెళ్లి అయ్యాక భార్యా, పిల్లలూ తన కుటుంబం అంటూ పరిధి గీసుకొని అందులోనే బతుకుతూన్న శంకరం ఈ కాలం మనుషుల మనస్థత్వాలకి ప్రతీకలా నిలుస్తాడని ఊహించలేదు సత్యనారాయణ. బాధగా తల వెనక్కి వాల్చాడతడు. ఆ బాధ కూతురి పెళ్లి ఎలా చేయగలనా అని కాదు... ఐశ్వర్యం ముందు అనుబంధం ఓడిపోయినందుకు!

☆

## కోపమెందుకో?

హైదరాబాద్ అమ్మాయి (అమ్మాయి అనొచ్చా? ఎందుకంటే దాదాపు నలభైల్లోకి వచ్చేసిన టింగణాయే కదా) అయిన టబూకి టాలీవుడ్ టాప్ హీరో నాగ్‌తో మంచి దోస్తానా వున్న సంగతి చాలాకాలంగా పాపులర్ అయింది. ఇటీవల వీళ్లిద్దరూ ముంబాయిలోని ఓ ఫ్యాషన్ షోకి కలిసి హాజరు కావడం పెద్ద వార్తయి కూర్చుంది. అయితే ఇలాంటి పనికిమాలిన సంగతుల్ని ఊరికే ఎందుకు ప్రచారం చేస్తారో అర్థంకాదు అంటూ గయ్యిమంది టబూ. కలిసి నలుగురి దృష్టిలోకీ వచ్చినప్పుడు దాన్ని చెప్పుకుంటే తప్పేంటమ్మా అని దీర్ఘాలు తీస్తున్నారు ఇది విన్న సినీ జనాలు.